క్లుప్తంగా

కళారత్న పురస్కార గ్రహీతలకు సత్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, గెట్ టు గెదర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న (హంస) అవార్డు అందుకున్న ప్రముఖులకు సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు సీహెచ్ మస్తానయ్య, నాట్యాచార్య డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యంను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రమణ్యం, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, సంస్థ అధ్యక్షులు మన్నె సుబ్బారావు, కోగంటి బసవనందికేశ్వరరావు పాల్గొని ఘనంగా సన్మానించారు.

ల్యాబ్ టెక్నీషియన్‌గా ఏడుకొండలుకు ఉద్యోగోన్నతి

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ల్యాబ్ అటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పోకూరి ఏడుకొండలుకు ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రమోషన్ లభించింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ పదోన్నతి ఉత్తర్వులు మంగళవారం అందజేశారు. జీజీహెచ్‌లో ఎంఎన్‌ఓగా 1986లో ప్రభుత్వ సర్వీసులో చేరిన ఏడుకొండలు, 2011లో ల్యాబ్ అటెండెంట్‌గా ప్రమోషన్ పొందారు. తాజాగా ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రమోషన్ పొందిన ఏడుకొండలుకు పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ సిబ్బంది, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు అభినందనలు తెలిపారు.

కార్పొరేషన్ కౌన్సిల్ సెక్రటరీగా శ్రీనివాసరావు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ సెక్రటరీగా బి.శ్రీనివాసరావును నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు, గుంటూరు కౌన్సిల్ సెక్రటరీగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కౌన్సిల్ సెక్రటరీ పి.శ్రీనివాసరావును మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

భర్త వేధింపులపై ఫిర్యాదు

లక్ష్మీపురం: నిత్యం మద్యం తాగి పని చేయకుండా అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురి చేస్తున్న ఘటనపై మంగళవారం రాత్రి కేసు నమోదు అయింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. రాజీవ్ గాంధీనగర్ 6వ లైన్ ప్రాంతానికి చెందిన నల్లపురెడ్డి పద్మజ, మనోహర్‌రెడ్డి 2007లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. భర్త మనోహర్‌రెడ్డి ఎలాంటి పని చేయకుండా నిత్యం మద్యం తాగి భార్యను కొట్టి వేధిస్తున్నాడు. అత్త, మరిది, ఆడపడుచు మానసికంగా వేధింపులకు గురి చేస్తూ అదనపు కట్నం తీసుకు రావాలని బెదిరింపులకు దిగారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

లక్ష్మీపురం: ఎంసెట్ కోచింగ్ వెళ్లిన విద్యార్థిని తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. బొంగరాలబీడు 4వ లైన్ ప్రాంతానికి చెందిన కె.కల్పన, ఓ కళాశాలలో ఇంటర్ చదివింది. అమరావతి రోడ్డులోని ఓ కళాశాలలో ఎంసెట్ కోచింగ్ తీసుకునేందుకు మంగళవారం ఇంట్లో నుంచి ఉదయం 8 గంటలకు బయటకు వెళ్లింది. కానీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల వద్ద, చుట్టు పక్కల ప్రాంతాలలో విచారించినా ఫలితం లేకుండా పోయింది. కల్పన తల్లి భారతి అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి



లక్ష్మీపురం: పట్టాభిపురంలోని రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైల్వే డీఆర్‌ఎం సుధేష్ఠ సేన్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ తన జీవితంలోని ప్రతి కూల పరిస్థితులను అధిగమించి గొప్ప నాయకుడిగా ఎదిగి భారత దేశాన్ని ఇతర దేశాలకు కూడా ఆదర్శంగా మార్చారన్నారు. ఏడీఆర్‌ఎం సైమన్ మాట్లాడుతూ కార్మిక హక్కుల పోరాట యోధుడు అని అన్నారు.

స్వరం మారుతోంది..

- ఆధునిక జీవనశైలితో ప్రభావం
- పెరుగుతున్న స్వర సమస్యలు
- ముందస్తు జాగ్రత్తలతో వాయిస్ సమస్యలు అధిగమించవచ్చు



వాయిస్ డే పోస్టర్లు

గుంటూరు మెడికల్: మానవునికి స్వరం వరం. స్వరం విభిన్న రీతుల్లో పలికించే శక్తి జీవరాశుల్లో ఒక్క మానవునికే ఉంది. గాయకులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఉపాధ్యాయులు, టివి, సినీ ఆర్టిస్టులు, డబ్బింగ్ ఆర్టిస్టులు స్వరంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. వీరిని ప్రొఫెషనల్ వాయిస్ యూజర్స్ అంటారు. స్వరం వీరి భవిష్యత్‌ను కూడా నిర్ణయిస్తుంది. ఇటువంటి వారిలో స్వరసమస్యలు పెద్ద సమస్యగా మారవచ్చు. నేడు ప్రపంచ స్వర దినోత్సవం..

స్వర సమస్యలు ఎలా ఉంటాయి...

స్వర సమస్యల్లో సామాన్యంగా వచ్చేది బొంగురు గొంతు. మాట్లాడేటప్పుడు బిగపట్టిపోవటం, మధ్యలో ఆగిపోవటం, మగవారిలో కీచుగొంతు లేక ఆడగొంతు రావటం, ఆడవారిలో మగ గొంతురావటం, గాయకుల్లో పాడేటప్పుడు గొంతు జీర పోవటం, తద్వారా పై స్థాయిలో పాడ లేక పోవటం తదితర సమస్యలు వస్తాయి. స్వర మార్గం సన్నబడుట, స్వరనాడుల మధ్య పొరలు ఏర్పడుట, స్వరనాడుల్లో పక్షవాతం మొదలగు స్వర సమస్యలు పుట్టకతో వస్తాయి. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల వయస్సులో పిల్లలో గొంతు బొంగురు పోతుంది. యుక్త వయస్సులో ఆడవారిలో మగ గొంతు, మగవారిలో ఆడ గొంతు ఏర్పడుతోంది. మధ్య వయస్సులో వారికి స్వరపేటికలో కణుతులు ఏర్పడి ఇవి క్యాన్సర్‌కు దారితీయవచ్చు. వృద్ధాప్యంలో స్వరపేటికలో క్యాన్సర్, స్వరనాడుల్లో కండరాలు పలుచబడుట వలన బొంగురు గొంతు ఏర్పడే అవకాశం ఉంది. థైరాయిడ్ ఆపరేషన్ తరువాత, తల, మెడ, ఛాతిలలో దెబ్బలు తగలటం వల్ల, వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల స్వరపేటిక పక్షవాతం వస్తోంది.

స్వరానికి హాని కలిగించే ఆహారాలు, పానీయాలు..

పాల ఉత్పత్తులు(పాలు, చీజ్, పెరుగు, ఐస్ క్రీం). పాల ఉత్పత్తులు శ్లేష్మం ఉత్పత్తిని పెంచుతాయి. పాల ఉత్పత్తుల వలన గొంతు మందంగా తయారై లోపల కఫం అనిపిస్తుంది. కెఫిన్ (కాఫీ, బ్లాక్ టీ, సోడా, ఎనర్జీ డ్రింక్స్).. కెఫిన్ ఒక డీహైడ్రేటర్. ఇది స్వర తంతువులతో సహా శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. దీనివలన స్వరం గరుకుగా వస్తుంది. ఆల్కహాల్.. ఆల్కహాల్ మనిషిని డీహైడ్రేట్ చేస్తుంది. స్వర తంతువులలో వాపును కలిగిస్తుంది, ఇది స్వర ఒత్తిడి, బొంగురుపోవడానికి దారితీస్తుంది. స్పైసీ ఫుడ్స్,. మిరపకాయ, హాట్ సాస్, మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలు యాసిడ్ రిఫ్లక్స్‌కు కారణమవుతాయి, ఇది స్వర తంతువులను ఇబ్బంది పెడుతుంది. గొంతులో మంటను సృష్టిస్తుంది. వేయించిన, నూనె పదార్థాలు.. జిడ్డుగల ఆహారాలు శ్లేష్మం పేరుకుపోవడాన్ని పెంచుతాయి, గొంతును కఠినంగా, గరుకుగా అనిపించేలా చేస్తాయి. అధిక ఉప్పు.. ఎక్కువ ఉప్పు గొంతును ఎండిపోయేలా చేస్తుంది, ఎక్కువసేపు మాట్లాడటం కష్టతరం చేస్తుంది. ప్రాసెస్ చేసిన చక్కెరలు(మిఠాయి, సోడా, కాల్చిన వస్తువులు).. చక్కెర గొంతు వాపునకు కారణమవుతుంది. శ్లేష్మం ఉత్పత్తిని పెంచుతుంది, దీని వలన గొంతు జిగటగా మారడం, లేదా మూసుకుపోతుంది

స్వరానికి ఉత్తమమైన ఆహారాలు..

1. నీరు – సహజ హైడ్రేషన్‌లాగా పనిచేస్తుంది
2. తేనె –స్వరాన్ని మృదువుగా చేస్తుంది
3. గ్రీన్ టీలు(కెఫిన్ లేనివి)– ఫారింజియల్ గోడపై శ్లేష్మాన్ని శుభ్రపరుస్తాయి, వాపు తగ్గిస్తాయి
4. తాజా పండ్లు, కూరగాయలు (సిట్రస్ లేనివి) తీసుకోవాలి
5. అల్లంతో వెచ్చని నీరు, స్వరాన్ని స్పష్టంగా, గంభీరంగా చేస్తుంది.

స్వరాన్ని ఇబ్బందికి గురిచేసే అలవాట్లు

ఎక్కువసేపు మాట్లాడటం లేదా పాడటం, ముఖ్యంగా అధిక వాల్యూమ్‌లలో లేదా ఎక్కువసేపు, స్వర తంతువులను ఒత్తిడికి గురి చేస్తుంది. బిగ్గరగా అరవడం వలన స్వర తంతువులపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది. డీహైడ్రేషన్ వల్ల స్వర తంతువులు మందంగా తయారై సరిగ్గా కంపించడానికి కష్టంగా మారతాయి.

స్పీచ్ థెరపీతో నయం చేయవచ్చు...



మంచి స్వర పద్ధతులను నేర్చుకోవడం ముఖ్యం. దూమపానం, మద్యపానం లాంటి స్వరానికి ఇబ్బంది కలిగించే ఇతర వాటిని వినియోగించడం మానేయాలి. స్వరానికి ఈ హాని కలిగించే ఆహార పదార్థాలను తీసుకోవద్దు. పుష్కలంగా నీరు తాగడం వలన స్వర తంతువులను లూబ్రికేట్ చేయవచ్చు. స్పీచ్–లాంగ్వేజ్ పెథాలజిస్ట్ ద్వారా స్వరాన్ని సమర్థవంతంగా ఎలా ఉపయోగించాలో నేర్చుకోవాలి

– టంగుటూరి నరేంద్ర, స్పీచ్ థెరపిస్ట్, గుంటూరు

సచివాలయ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలోని వార్డు సచివాలయాల కార్యదర్శులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం బ్రాడీపేట, కోబాల్ట్ పేట, లక్ష్మీపురం, ఎన్టీఆర్ స్టేడియం, ఏటీ అగ్రహారం, చుట్టగుంట జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్‌తో మాట్లాడారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి కుక్కల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతుల ఫైల్‌ని అక్కడే ఓకే చేసి, త్వరగా పనులు ప్రారంభించాలని డీఈఈని ఆదేశించారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఫ్రిజ్ మరమ్మతులకు గురవ్వడం గమనించి, ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. బ్రాడీపేట వైపు పీకలవాగులో తీసిన సిల్ట్ తొలగించకపోవడం, స్థానికులు కూడా అక్కడే వ్యర్థాలు వేయడం గమనించి తక్షణం తొలగించాలని సూచించారు. కంకర గుంట ఆర్‌యూబీ వద్ద జరుగుతున్న రోడ్ నిర్మాణ పనులను పరిశీలించి, వేగంగా చేపట్టాలన్నారు. చుట్టగుంట జంక్షన్‌లో అవుట్ ఫాల్ డ్రెయిన్ విస్తరణ చేపట్టడానికి పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, మధుసూదన్, ఏసీపీ, రెహ్మాన్ పాల్గొన్నారు.

దశల వారీ పోరాటాలకు సమాయత్తం అవుదాం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

లక్ష్మీపురం: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ వక్ఫ్ చట్టానికి సవరణ చేసిందని, బిల్లు ఉపసంహరించే వరకు దశల వారీ పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. కొత్తపేటలోని మల్లయ్యలింగంభవన్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేవలం కొద్ది మంది పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణ చేసిందని చెప్పారు. రాజ్యాంగ విరుద్ధంగా చేసిన ఈ బిల్లును తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముస్లిం ఐక్య వేదిక నాయకులు జియావుర్ రెహమాన్, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ మాట్లాడుతూ ముస్లిం' సమాజానికి పూర్తి వ్యతిరేకంగా ఈ సవరణ చేయబడిందని, నష్టం కలిగించే అనేక అంశాలు ఈ చట్టంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బిల్లా సునీల్, ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బషీర్ అహ్మద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి, ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి చిష్ట, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగ నాయకులు జబివుల్లా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య ప్రముఖ సీనియర్ న్యాయవాది వైకే, సీపీఐ ఎంఎల్ నాయకులు సాదు మాల్యాద్రి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించారు.

చీకటి చట్టానికి కూటమి వంత పాడటం సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న గులాంరసూల్, పక్కన మస్తాన్‌వలి తదితరులు

పట్నంబజారు: ముస్లిం మైనారిటీలను అణిచివేసేలా కేంద్ర ప్రభుత్వం బిల్లు పాస్ చేసిన చీకటి చట్టానికి.. కూటమి సర్కార్ వంత పాడటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ గులాంరసూల్ విమర్శించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్‌బిల్లు వలన ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధ్యాత్మికంగా మసీదులు, మదర్సాలు, ఇతర పలు సంస్థలకు పెద్దలు ఇచ్చిన భూములు లాక్కునే విధంగా కేంద్ర సర్కార్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఆయా స్థలాలకు సంబంధించిన రికార్డులను చూపమంటే.. వందల ఏళ్ల భూముల రికార్డులు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. అంబానీ, ఆదానీలను సంతోషపరిచేందుకు వక్ఫ్‌భూములు ప్రధాని నరేంద్రమోదీ లాక్కుంటుంటే.. మోదీని సంతోషపరిచేందుకు సీఎం చంద్రబాబు మద్దతు సంతకం పెట్టారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్ బిల్లు రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టుకు వెళ్లడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్ఆర్‌సీ బిల్లును వ్యతిరేకించిన దమ్మున్న నాయకుడు జగనన్న అని, అదే దమ్ము చంద్రబాబుకు ఉంటే వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయలేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తమకు న్యాయ స్థానాలపై నమ్మకం, అపారమైన గౌరవం ఉన్నాయని, కచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి మైనారిటీ ఎమ్మెల్యేలు వారి అధినేతను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, కార్పొరేటర్ రోషన్, మార్కెట్ బాబు పాల్గొన్నారు.

పోలీసులకు ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ హనుమంతు

పట్నంబజారు: నగరంపాలెంలోని పోలీసు కళ్యాణ మండపంలో మంగళవారం ఆర్కా హాస్పిటల్స్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో గుంటూరు జిల్లా పోలీసు విభాగంలోని పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎ.హనుమంతు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా పోలీసు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఆర్కా హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులకు పోలీసుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. రేడియషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ డి.ఎస్.రాజునాయుడు మాట్లాడుతూ అహర్నిశలు ప్రజా శ్రేయస్సు కోసం పనిచేసే పోలీసులకు ఆరోగ్యాన్ని పర్యవేక్షించే బాధ్యత వైద్యుడిగా తమపై ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉచిత వైద్య సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు, క్యాన్సర్, గైనకాలజి, ఆర్థోపెడిక్, కార్డియాలజి, ఇతర ఆరోగ్య సేవలను పోలీసులకు అందజేశారు. 146 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆర్కా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పవన్ రాఘవరెడ్డి, డాక్టర్ కల్లూరి, డాక్టర్ హేమంత్ మాకినేని, డాక్టర్ హిమని మంచాల, ఉదయ్ హాస్పిటల్ నుంచి డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ విశాలాక్షి తోట, కృష్ణ నర్సింగ్ హోమ్ నుండి డాక్టర్‌పెద్ది నవీన్ కృష్ణ, తదితరులు వైద్య పరీక్షలు చేశారు.

నామ మాత్రం రుసుంతో వృద్ధులకు ఆశ్రయం

మొవ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎంవీ రామిరెడ్డి



పెదపరిమి గ్రామంలోని వృద్ధాలయం

గుంటూరు ఎడ్యుకేషన్: నామమాత్రపు రుసుం(నెలకు రూ.రెండు వేలు)తో అన్ని సదుపాయాలతో కూడిన వృద్ధాలయంలో ప్రవేశాలు కల్పించనున్నట్లు మొవ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎంవీ రామిరెడ్డి తెలిపారు. అమరావతి రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో తమ తండ్రి జ్ఞాపకార్థం స్థాపించిన వృద్ధాలయంలో ఆధునిక వసతులు, మౌలిక సౌకర్యాలతో 36 మందికి ప్రత్యేక గదులతోను, డార్మెటరీ ద్వారా మరో 30 మందికి అవకాశం అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 60 ఏళ్లు దాటి తమ పనులు తాము చేసుకోగల వృద్ధులకు వసతి, భోజన సదుపాయాలతో పాటు 24 గంటలు ఆరోగ్య సేవలకు ఒక నర్సును అందుబాటులో ఉంచామన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక సిబ్బందితో సేవలందిస్తున్నామని చెప్పారు. వినోదం కోసం టీవీలు, ఇండోర్ గేమ్స్, యోగా, ప్రత్యేక గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. న్యూట్రిషనలిస్టు పర్యవేక్షణలో ఉదయం రుచి, సుచి గల అల్పాహారం, మధ్యాహ్నం టీ, స్నాక్స్, రెండు పూటలా భోజనం అందిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు, ప్రవేశాలకు ట్రస్ట్ ప్రతినిధి మున్నంగి శ్రీనివాసరెడ్డిని 99595 89452 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ తిప్పలు

- విజ్ఞాన మందిరంలో జీఎంసీ ఉద్యోగులతో ఫీడ్ బ్యాక్
- సుమారు ఒక్క రోజే తలుపులకు తాళాలు వేసి మరి 35 వేల దాకా సర్వే చేయించిన వైనం
- మూడో స్థానంలో నిలిచిన గుంటూరు నగరపాలక సంస్థ



సర్వే ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ ఫీడ్ బ్యాక్‌లో మెరుగైన ర్యాంకు సాధించిన మున్సిపాలిటీలకు ప్రత్యేక గ్రాంట్ కేంద్ర ప్రభుత్వం అందించనుంది. ఫీడ్ బ్యాక్ కోసం నగరపాలక సంస్థలో పనిచేసే సూపరింటెండెంట్‌లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్స్, రికార్డ్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఆఫీస్ సబార్డినేట్స్, ఆప్కాస్ ఉద్యోగులంతా ఉదయం 7.30 గంటలకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరానికి రావాలని అధికారులు ఆదేశించారు. సాయంత్రం వరకు ఉండే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

తలుపులు వేయించి మరి...

సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వేలో ఈ నెల 14వ తేదీ సాయంత్రానికి మొదటి స్థానంలో గ్రేటర్ విశాఖపట్నం, రెండో స్థానంలో విజయవాడ, మూడో స్థానంలో తిరుపతి, నాలుగో స్థానంలో గుంటూరు నిలిచింది. దీంతో ఎలాగైన గుంటూరు నగరపాలక సంస్థ మూడో స్థానానికి రావడం కోసం మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్ర 5.30 గంటలకు ఉద్యోగుల కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న వారందరికి ఫోన్లు చేసి వారితో స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ కోసం వారి ఫోన్‌కు వచ్చే ఓటీపీని తెప్పించుకుని ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. దీంతో మంగళవారం ఒక్కరోజే సుమారు 36 వేల మందితో ఫీడ్ బ్యాక్ చేయించుకుని విజయవాడను బీట్ చేసి రెండో స్థానంలోకి గుంటూరు చేరింది. గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ఉద్యోగులతో సర్వే వేగవంతం చేస్తున్నారని గమనించిన.. విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు కూడా సర్వే వేగవంతం చేశారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు గ్రేటర్ విశాఖపట్నం 5,01,334 మంది ఫీడ్ బ్యాక్‌తో మొదటి స్థానంలో, 1,73,847 మంది ఫీడ్ బ్యాక్‌తో విజయవాడ రెండో స్థానంలో నిలవగా, గుంటూరు 1,73,782 మంది ఫీడ్ బ్యాక్‌తో మూడో స్థానంలో నిలిచింది.

ఉద్యోగుల అసహనం

ఒక ప్రణాళికాబద్ధంగా కాకుండా హడావుడిగా మమ్మల్నిందరిని విజ్ఞాన మందిరానికి తీసుకొచ్చి కనీసం బయటకు పోకుండా తాళాలు వేసి సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వే చేయించడంపై సచివాలయ ఉద్యోగులు, నగరపాలక సంస్థ ఉద్యోగులు నగరపాలక సంస్థ అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరి సిటిజన్ ఫీడ్ బ్యాక్ సర్వే ఒక ప్రణాళికబద్ధంగా నెల రోజుల ముందు నుంచే చేపట్టి ఫీడ్ బ్యాక్ సర్వేలో మెరుగైన ర్యాంకు సాధించారని కాని ఇప్పుడు ఈ విధంగా ఉద్యోగులను అతి తక్కువ సమయంలో పార్కుల చుట్టూ, మార్కెట్లు తిప్పుతూ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

S.No	U.B Name	No. of Feedback as on 15-04-2025, 06.30pm VFYC-Web	VFYC-App	Swachhata App	TOTAL
1	GVMC VISAKHAPATNAM	[illegible]	[illegible]	[illegible]	5,01,334
2	VIJAYAWADA	[illegible]	[illegible]	[illegible]	1,73,847
3	GUNTUR	172087	1695	0	1,73,782
4	TIRUPATI	[illegible]	[illegible]	[illegible]	[illegible]
5	RAJAHMUNDRY	[illegible]	[illegible]	[illegible]	[illegible]
6	KAKINADA	[illegible]	[illegible]	[illegible]	[illegible]

మంగళవారం సాయంత్రం 6.30 వచ్చిన ఫీడ్ బ్యాక్ వివరాలు

ఉత్సాహంగా 'కవిత్వంతో కాసేపు'

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతినెలా నిర్వహిస్తున్న కవిత్వంతో కాసేపు కార్యక్రమాన్ని సంఘ ఉపాధ్యక్షురాలు షేక్ కాశింబి నివాసంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత, సాహిత్య ప్రముఖులు భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజాన్ని తట్టి లేపేది కవిత్వమన్నారు. గుంటూరు జిల్లా రచయితల సంఘ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతినెలా ఒక సభ్యుని ఇంట్లో జరపడం బాగుందని, ఇది నిరంతరం కొనసాగాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభానీ, కవులు తాటికోల పద్మావతి, చుండూరు శేషుమాంబ, పింగళి భాగ్యలక్ష్మి, నానా, శ్రీ వశిష్ఠ సోమేపల్లి, పి. బలరాం, మెట్టు శ్రీనివాసరెడ్డి, సి.సురేష్, గిరిభూషణరావు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన అవసరం

రాష్ట్ర అవయవదాతల సంఘ అధ్యక్షుడు రమణ యశస్వి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: అవయవ దానంపై అవగాహన అవసరమని అవయవదాతల సంఘ వ్యవస్థాపకుడు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి పేర్కొన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో నేత్ర, అవయవ దేహదాన ప్రాధాన్యంపై వల్లూరు సదాశివరావు ప్రచురించిన కరపత్రాన్ని మంగళవారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన మనిషి అవయవాల విలువ రూ.మూడు కోట్లకు పైగా ఉంటుందని, మూఢ విశ్వాసాల కారణంగా మనిషి మరణానంతరం వాటిని మట్టిలో కలిపేయటం ఆధునిక సమాజంలో అంత తెలివైన పని కాదన్నారు. డాక్టర్ టి.సేవాకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపకుడు మేడూరి రాజేంద్రప్రసాద్, జనవిజ్ఞాన వేదిక నాయకుడు వెంకట్రావు, జిల్లా మలేరియా నివారణా విశ్రాంత అధికారి రవీంద్ర బాబు, రమణ బాబు, గుంటుపల్లి ఎస్ఎస్‌వీ ప్రసాద్ రావు, నాంచారయ్య, ప్రసన్న కుమారి, ఎస్‌హెచ్ఓ మేనేజర్ నిర్మల రాణి, ఆంజనేయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పట్నంబజారు: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అగ్నిమాపక శకటాలతో సిబ్బంది, అధికారులు అవగాహన కల్పించారు. నాజ్‌సెంటర్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ఫైర్ డెమో నిర్వహించారు. హాస్పటల్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఫంక్షన్‌హాల్స్, మాల్స్, థియేటర్‌లలో గోడపత్రికలు అంటించి, కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు ఏవిధంగా నివారించాలో ప్రజలకు మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్–2 అధికారి పి.శ్రీనివాసరావు, సహాయ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.